సాక్షి
అనంతపురం
శుక్రవారం । 5 । జూలై । 2024



టన్ను చీనీ రూ.18,500

అనంతపురం మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.18,500, కనిష్టం రూ.10 వేల ప్రకారం పలికాయి.



కిలో టమాట రూ.35

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.35 పలికింది. మార్కెట్‌కు 600 టన్నుల సరుకు అమ్మకానికి వచ్చింది.

గరిష్టం/కనిష్టం
36.6°/24.4°

జిల్లా అంతటా గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 8 నుంచి 12 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

ఆదర్శప్రాయుడు అల్లూరి

- కలెక్టర్ వినోద్‌కుమార్



అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న కలెక్టర్ వినోద్ కుమార్, చిత్రంలో కమిషనర్ మేఘస్వరూప్

అనంతపురం అర్బన్: బ్రిటీష్ వారికి సింహ స్వప్నంగా మారి దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన పోరాట యోధుడు, మన్నెం వీరుడు అల్లూరి సీతారామరాజు ఆదర్శప్రాయుడని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అన్నారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో అల్లూరి సీతారామరాజు 127వ జయంతి వేడుక నిర్వహించారు. అల్లూరి చిత్రపటానికి కలెక్టర్ పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు చిరస్మరణీయుడన్నారు. బ్రిటీష్ వారి తూటాలకు గుండెలు ఎదురు పెట్టి ప్రాణాలు అర్పించిన ఆయన పోరాటం చరిత్రలో నిలిచిపోయిందన్నారు. తన పోరాటం ద్వారా దేశభక్తి, జాతీయవాద జ్వాలలను రేకెత్తించారన్నారు. బ్రిటీష్ పాలకుల దోపిడీ, దమన కాండలను వ్యతిరేకించి అనేక మందికి ప్రేరణగా నిలిచారన్నారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ మేఘస్వరూప్, డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి, డీటీడబ్ల్యూఓ రామాంజినేయులు, ఇతర అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తల పిల్లలకు టీసీలిచ్చి పంపండి!

తాడిపత్రి: మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయంలో ఈ ఏడాది ఆరో తరగతిలో చేరిన వైఎస్సార్ సీపీ కార్యకర్తల పిల్లలకు టీసీలు ఇచ్చి పంపించాలంటూ కొందరు టీడీపీ నాయకులు ప్రిన్సిపాల్‌పై ఒత్తిడి తెచ్చారు. ఈ క్రమంలో పిల్లలను తీసుకుని వెళ్లడానికి రావాలని వారి తల్లిదండ్రులకు ఫోన్‌చేసి చెబుతున్నారని విద్యార్థినుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పిల్లలకు విద్యా భద్రత కల్పించాలని కోరుతున్నారు.

సరుకులు సక్రమంగా పంపిణీ చేయండి



గుత్తిలో ఎండీయూ వాహనాన్ని తనిఖీ చేస్తున్న డీఎస్‌ఓ శోభారాణి

గుత్తి: రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని డీఎస్‌ఓ శోభారాణి సూచించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఇంటింటికీ రేషన్ సరుకులు పంపిణీ చేసే ఎండీయూ వాహనాలను గురువారం డీఎస్‌ఓ శోభారాణి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తూకాల్లో తేడాల్లేకుండా చూసుకోవాలన్నారు. అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ భారతి, సీఎస్‌డీటీ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

టీబీ డ్యాంకు 15,492 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



తుంగభద్ర జలాశయం

బొమ్మనహాళ్: తుంగభద్ర జలాశయానికి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. గురువారం ఉదయానికి 15,492 క్యూసెక్కులకు పైగా వరద నీరు జలాశయంలోకి వచ్చి చేరింది. ఎగువన ఉన్న చిక్ మగళూరు, కొప్పి, శివమొగ్గ, శృంగేరి, వరనాడు, మలేనాడు, తీర్థనహళ్లి ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు అక్కడి వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. టీబీ డ్యాంకు ఇన్‌ఫ్లో వస్తుండడంతో హెచ్చెల్సీ ఆయకట్టు రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. వరినార్లు పోసి ఖరీఫ్ పంటల సాగుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. ప్రస్తుతం డ్యాంలో 1,633 అడుగుల నీటి మట్టానికి గాను 1,588.84 అడుగులకు నీరు చేరింది. డ్యాం పూర్తి సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా ప్రస్తుతం 10.089 టీఎంసీల నీరు ఉంది. ఇన్‌ఫ్లో 15,492 క్యూసెక్కులు, అవుట్‌ఫ్లో 273 క్యూసెక్కులుగా నమోదవుతోంది.

అధికార అరాచకం

- ఎన్నికల ఫలితాలొచ్చినప్పటి నుంచి రెచ్చిపోతున్న టీడీపీ శ్రేణులు
- నెల రోజులైనా ఆగని దుశ్చర్యలు
- పైశాచికంగా శిలాఫలకాలు, విగ్రహాల ధ్వంసం
- ప్రశాంతంగా ఉండే విద్యాలయాల్లోనూ దౌర్జన్యాలు
- అత్యున్నత పోస్టుల్లో ఉన్న వారికీ బెదిరింపులు
- లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందకుండా అడ్డంకులు
- ఒత్తిడి తట్టుకోలేక ఇప్పటికే పలువురి ఆత్మహత్య
- కళ్లు మూసుకున్న పోలీసులు
- బిక్కుబిక్కుమంటున్న 'ఉమ్మడి అనంత'



ఎన్నికల రోజున యాడికి మండలం కోనుప్పల పాడులో వైఎస్సార్ సీపీ శ్రేణులపై రాళ్లు రువ్వుతున్న టీడీపీ నాయకులు



టీడీపీ నేతల ఒత్తిడి తట్టుకోలేక ప్రాణాలు విడిచిన అనంతపురం రూరల్ మండలం కామారుపల్లి యానిమేటర్ అంజనాదేవి (ఫైల్)

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఎన్నికల ఫలితాలు వెలువడి నెలరోజులు మాత్రమే పూర్తయింది. అప్పుడు మొదలైన టీడీపీ నాయకుల అరాచకం నేటికీ కొనసాగుతోంది. దాడులు, దౌర్జన్యాలు, ప్రభుత్వ ఆస్తుల ధ్వంసాలతో ఎక్కడ చూసినా దారుణ పరిస్థితులు నెలకొన్నాయి. ఇంత జరుగుతున్నా పోలీసులు ఒక్క ఘటనపైనా కేసు నమోదు చేసిన పాపాన పోలేదు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో పరిస్థితులు రోజు రోజుకూ దిగజారుతున్నాయన్న చర్చ ప్రజల్లో మొదలైంది.

వేధిస్తున్నారు.. చంపుతున్నారు

కొన్ని రోజులుగా టీడీపీ నాయకుల అరాచకాలకు అంతేలేకుండా పోతోంది. కొన్ని రోజుల క్రితం పుట్లూరు మండలం కోమటిగుంట్లలో ఎరికలయ్య అనే వ్యక్తిపై దాడి చేసి చంపారు. వైఎస్సార్ సీపీకి మద్దతుదారుగా ఉన్నందుకే ఆయన్ను హత్య చేశారు. తాజాగా హిందూపురం మండలం గోళ్లపురం గ్రామంలో సతీష్ అనే వైఎస్సార్ సీపీ కార్యకర్త టీడీపీ నాయకుల దాడిలో మృతి చెందారు. ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం పనిచేశారనే అక్కసుతో కక్షగట్టి చంపినట్టు కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఇక.. పది రోజుల క్రితం అనంతపురం రూరల్ మండలం కామారుపల్లిలో యానిమేటర్‌గా పని చేస్తున్న అంజనాదేవిని రాజీనామా చేయాలంటూ టీడీపీ కార్యకర్తలు బెదిరించడంతో గుండెపోటుతో ఆమె మృతి చెందారు. వజ్రకరూరు మండలం ఛాయాపురం గ్రామంలో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకురాలైన బోయ సుంకమ్మను బాధ్యతల నుంచి తొలగిస్తామని చెప్పడంతో రెండు రోజుల క్రితం ఆమె ఆత్మహత్యకు యత్నించింది. ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఇలాంటి ఘటనలు ఉమ్మడి అనంతపురం జిల్లాలో రోజూ ఎక్కడో ఒక చోట చోటు చేసుకుంటూనే ఉన్నాయి.

లబ్ధిదారులకు బెదిరింపులు..

గడిచిన ఐదేళ్లలో అర్హులైన ప్రతి లబ్ధిదారుడికీ ప్రభుత్వం నుంచి పథకాలు అందాయి. ఎక్కడా పార్టీ, కులం, మతం వంటివేవీ చూడలేదు. అయితే, చంద్రబాబు ప్రభుత్వంలో మాత్రం కొన్ని గ్రామాల్లో లబ్ధిదారులకు పెన్షన్ ఇవ్వకుండా టీడీపీ కార్యకర్తలు అడ్డుకుంటున్నారు. ఇటీవల యాడికి మండలంలోని గ్రామాల్లో పలువురికి పింఛన్ల పంపిణీని టీడీపీ నాయకులు అడ్డుకోగా.. పోలీసుల సాయంతో పంపిణీ చేయాల్సి వచ్చింది. శ్రీ సత్యసాయి జిల్లా బత్తలపల్లిలో 85 ఏళ్ల వృద్ధురాలికి పింఛన్ ఇవ్వకపోవడంతో ఏకంగా ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఆమె ధర్నాకు దిగారు. ఇదే మండలంలోని మాల్యవంతం పంచాయతీలో ఎస్సీలకు పింఛన్ ఇవ్వకపోవడంతో ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. రాప్తాడు మండలం ఎంసీ పల్లిలో పలువురికి పెన్షన్ అందకపోవడంతో శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నాకు దిగారు. ఆర్‌కొత్త పల్లికి చెందిన నందవర్ధిని తలసేమియా వ్యాధితో బాధపడుతున్నా పెన్షన్ డబ్బు ఇవ్వలేదు. అకస్మాత్తుగా పెన్షన్ అందక పేదల ఆవేదన వర్ణనాతీతంగా మారింది.

భయభ్రాంతుల్లో అధికారులూ..

ఓట్లేసి, వేయించి గెలిపించుకున్నామని చెప్పుకుంటున్న ప్రభుత్వ సిబ్బందినీ టీడీపీ నేతలు వదలడం లేదు. ఇటీవల తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి ఏకంగా రవాణా శాఖ అధికారులకు వార్నింగ్ ఇచ్చారు. 'నరుకుతా' అంటూ హెచ్చరించారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రశాంతతకు మారుపేరైన యూనివర్సిటీలకూ అరాచకాలు పాకాయి. అత్యున్నత హోదా కలిగిన వైస్ ఛాన్సలర్లపైనే దౌర్జన్యాలకు దిగారు. ఏకంగా ఎస్కేయూ వీసీ కారుపై దాడి చేసి భయభ్రాంతులకు గురి చేశారు. జేఎన్‌టీయూ వీసీ, రిజిస్ట్రార్‌లనూ భయపెట్టారు. దీంతో ప్రభుత్వ సిబ్బందిలో అంతర్మథనం మొదలైంది. నెలరోజుల్లోనే పాలన అంటే ఏంటో అందరికీ రుచి చూపించారని వాపోతున్నారు. మరోవైపు.. రైతు భరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయాల భవనాల శిలాఫలకాల ధ్వంసాలు కొనసాగుతూ ఉండడంతో పల్లెవాసులు బిక్కుబిక్కుమంటున్నారు. గత ఐదేళ్లలో గ్రామాల్లో ఎక్కడా ఫ్యాక్షన్ ఛాయలు లేవు. నేడు మళ్లీ ఆ పరిస్థితులు పురుడు పోసుకుంటున్నారని జనం చర్చించుకుంటున్నారు.



చిలమత్తూరు మండలం కొడికొండలో టీడీపీ నాయకుల దాడిలో తీవ్రంగా గాయపడ్డ నరసింహమూర్తి (ఫైల్)



తెలుగు తమ్ముళ్ల రాళ్ల దాడిలో దెబ్బతిన్న కళ్యాణదుర్గం వైఎస్సార్ సీపీ నేత ఉమా ప్రచార వాహనం (ఫైల్)



పెద్దవడుగూరు మండలం అప్పేచెర్లలో సచివాలయం వద్ద శిలాఫలకం పగులగొడుతున్న టీడీపీ మూకలు(ఫైల్)



టీడీపీ నాయకుల దాడిలో గాయపడి రెండు రోజుల క్రితం మృతి చెందిన హిందూపురం మండలం గోళ్లపురంవాసి సతీష్



ఇంటి పెద్ద మృతితో కన్నీరుమున్నీరవుతున్న సతీష్ కుటుంబసభ్యులు



టీడీపీ కార్యకర్త కొడవలితో దాడి చేయడంతో గాయపడిన తలుపుల గెరికపల్లివాసి చెన్నకృష్ణారెడ్డి





టీడీపీ నాయకులు వేటకొడవలితో దాడి చేయడంతో గాయపడిన బుక్కరాయసముద్రం మండలం కొర్రపాడుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు ఆదిలక్ష్మి, కిరణ్ (ఫైల్)

క్షేత్రస్థాయిలో నీటి లభ్యత పెరగాలి

- సెంట్రల్ నోడల్ అధికారి అరులానందన్



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్, చిత్రంలో సెంట్రల్ నోడల్ అధికారి అరులానందన్

అనంతపురం అర్బన్: 'క్షేత్రస్థాయిలో నీటి లభ్యత పెరగాలి. తదనుగుణంగా చర్యలు ఉండాలి. ప్రతి వర్షపు నీటి బొట్టు భూమిలోకి ఇంకేలా చూడాలి. జిల్లాలో నీటి వనరుల బలోపేతమే లక్ష్యంగా పనులు చేపట్టాలి' అని సెంట్రల్ నోడల్ అధికారి ఎ.అరులానందన్, కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అన్నారు. జలశక్తి అభియాన్ పథకం కింద చేపడుతున్న పనులపై నోడల్ అధికారి, కలెక్టర్ గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో శాస్త్రవేత్త సి.షరీఫ్‌ఖాన్‌తో కలిసి అధికారులతో సమీక్షించారు. వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా చేస్తే భూగర్భజలం వృద్ధి చెందుతుందన్నారు. క్యాచ్‌మెంట్ ఏరియాలను గుర్తించి చెక్‌డ్యామ్‌ల నిర్మాణం చేపట్టాలన్నారు. ఇంకుడు గుంతల ఏర్పాటుపై దృష్టి పెట్టాలన్నారు. జలశక్తి అభియాన్ కింద చేపట్టిన పనులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామన్నారు. జిల్లాలో ఫారంపాండ్, బ్లాక్ ప్లాంటేషన్ పనులు పెద్ద ఎత్తున చేపట్టాలన్నారు. పట్టణాలు, గ్రామాల్లో నీటి సరఫరాపై ప్రతి రోజూ నివేదికలు అందించాలన్నారు. సమావేశంలో డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ ఎహసాన్ బాషా, హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ఎస్‌ఈ దేశేనాయక్, భూగర్భజల శాఖ డీడీ తిప్పేస్వామి, ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి, ప్రజారోగ్యశాఖ ఈఈ సతీష్‌చంద్ర, హెచ్ఎల్‌సీ ఈఈ రమణారెడ్డి, మైక్రో ఇరిగేషన్ ఈఈ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయలో ఖాళీ సీట్ల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వండి

గుత్తి వద్ద ఉన్న ప్రధానమంత్రి శ్రీ కేంద్రియ విద్యాలయలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో విద్యాలయ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాలయలో 384 సీట్లకు గానూ 348 మంది విద్యార్థులు చేరారన్నారు. మిగిలిన 36 సీట్ల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు. ఖాళీల సమాచారం విద్యార్థులకు తెలిసేలా చూడాలన్నారు. విద్యాలయలో నిర్మాణంలో ఉన్న ల్యాబ్ పనులు నెలరోజుల్లో పూర్తవ్వాలని చెప్పారు. ప్రత్యేక గ్రాంట్ కింద చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలన్నారు. విద్యాలయలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రతి నెలా 5న వేతనం ఇవ్వాలన్నారు. విద్యార్థులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జరిగే క్రీడా పోటీల్లో పాల్గొనేలా చూడాలని చెప్పారు. భవిష్యత్తులో ఐఏఎస్, ఐపీఎస్ వంటి ఉన్నత శిఖరాలను అధిరోహించేలా తీర్చిదిద్దాలన్నారు. సమావేశంలో గుంతకల్లు ఆర్‌డీఓ శ్రీనివాసులురెడ్డి, గుత్తి తహసీల్దారు భారతి, హైదరాబాద్ కేంద్రియ విద్యాలయ సంఘటన్ అసిస్టెంట్ కమిషనర్ కృష్ణవేణి, విద్యాలయ ప్రిన్సిపాల్ మల్కిసాబ్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

7న ఈపీఎఫ్ఓ, ఈఎస్ఐసీ పరీక్షలు



మాట్లాడుతున్న డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డి

అనంతపురం అర్బన్: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్‌సీ) ఆధ్వర్యంలో ఈనెల 7న ఈపీఎఫ్ఓ, ఈఎస్ఐసీ పరీక్షలు జరగనున్నాయని డీఆర్‌ఓ జి. రామకృష్ణారెడ్డి అన్నారు. పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు కేంద్రాల్లో ఉదయం 9 గంటలకు ప్రారంభం కానున్న ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ పర్సనల్ అసిస్టెంట్ పోస్టులకు 354 మంది, మధ్యాహ్నం 1.30 నుంచి ఆరు కేంద్రాల్లో జరగనున్న ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ నర్సింగ్ ఆఫీసర్ పోస్టుకు 2,109 మంది అభ్యర్థులు హాజరవుతారన్నారు. పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు కేంద్రానికి ఒకరు చొప్పున ఎనిమిది మంది తనిఖీ అధికారులను, ఎనిమిది మంది రూట్ అధికారులను నియమించామన్నారు. కేంద్రాల వద్ద అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. అభ్యర్థులు నిర్దేశించిన పరీక్ష సమయం కంటే 30 నిమిషాలు ముందే చేరుకోవాలని చెప్పారు. ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించరన్నారు. ఈ-అడ్మిట్ కార్డుతో పాటు ఏదేని గుర్తింపు కార్డును తప్పనిసరిగా వెంట తెచ్చుకోవాలని సూచించారు. అభ్యర్థుల కోసం యూపీఎస్‌సీ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసిందన్నారు. సమాచారం లేదా ఫిర్యాదు నిమిత్తం 011-23383052, 011-23381131, 11-23381132,011-23382627, 011-23382703, 011-23386315 నంబర్లకు ఫోన్ చేయాలన్నారు.

9న జెడ్పీ సమావేశం

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి ముహూర్తం కుదిరింది. ఈ నెల 9న సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. అనంతపురంలోని జెడ్పీ కార్యాలయ సమావేశ మందిరంలో ఆ రోజు ఉదయం 10.30 గంటలకు జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన సమావేశం ప్రారంభం కానుంది. జెడ్పీ ముఖ్య కార్య నిర్వాహణాధికారి వైఖోమ్ నిదియాదేవి ఆదేశాల మేరకు ప్రజాప్రతినిధులు, రెండు జిల్లాల కలెక్టర్లు, అన్ని శాఖల అధికారులకు సమాచారాన్ని జెడ్పీ ఉద్యోగులు చేరవేశారు. కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక తొలి సమావేశం జరగనుండడం గమనార్హం.

అంతా మేమే.. అన్నీ మాకే!

- బీజేపీ, జనసేన నాయకులను పట్టించుకోవాల్సిన పనిలేదు
- మార్కెట్‌యార్డులో టీడీపీ నేతల హల్‌చల్
- టెండర్లన్నీ తమ వాళ్లకే దక్కాలంటూ అధికారులకు హుకుం



అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డు పాలకవర్గ భవనం

అనంతపురం అగ్రికల్చర్: 'ఏం చేస్తారో తెలీదు.. అన్నీ మా వాళ్లకే దక్కాలి. అందులోనూ మేం సిఫారసు చేసిన వాళ్లకు అవకాశం కల్పించాలి. మరెవరికీ సహాయ సహకారాలు అందించవద్దు. జనసేన, బీజేపీ వాళ్లు వచ్చినా అస్సలు అవకాశం ఇవ్వొద్దు' అంటూ అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యే అనుచర వర్గం అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డు టెండర్లకు సంబంధించిన విషయంలో హల్‌చల్ చేస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. దీంతో కొందరు కాంట్రాక్టర్లు, ఆశావహులు అధికార పార్టీ నేతల చుట్టూ తిరుగుతున్నారు. స్థానిక మార్కెట్‌యార్డులో ఏటా వివిధ పనులకు సంబంధించి టెండర్లు ఆహ్వానించి నిబంధనల మేరకు అధికంగా కోట్ చేసిన వ్యక్తులు, సంస్థలకు సదరు టెండరు కట్టబెట్టడం జరుగుతోంది. దీంతో అటు మార్కెట్ కమిటీకి, ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతోంది. గత ఐదేళ్లుగా ఎలాంటి విమర్శ, ఒత్తిళ్లు లేకుండా అత్యంత పారదర్శకంగా ఈ వ్యవహారం నడుస్తోంది.

మారిన సీన్..

కూటమి ప్రభుత్వం వచ్చాక సీన్ పూర్తిగా మారిపోయింది. స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో 9 రకాల పనులకు ఇటీవల సీల్డ్ కవర్ల ద్వారా టెండర్లు ఆహ్వానించారు. పండ్లమార్కెట్, పశువుల మార్కెట్‌లో చెత్తాచెదారం ఊడ్చి తరలించడం, పశువుల మార్కెట్‌లో ప్రతివారం పేడను ఊడ్చడం, పండ్ల మార్కెట్‌లో సంచార మొబైల్ ఫలహారశాల నిర్వహణ, పశువులు, జీవాల మార్కెట్‌లో కట్టుతాళ్ల అమ్మకాల దుకాణం ఏర్పాటు, ఫలాహారశాల నిర్వహణ, టీ స్టాల్ ఏర్పాటు, మార్కెట్‌యార్డులో 40 మెట్రిక్ టన్నుల వే-బ్రిడ్జి నిర్వహణ, చీనీకాయల గ్రేడింగ్ మిషన్ నిర్వహణ, పండ్లమార్కెట్, పశువుల మార్కెట్‌లో సోడాలు, శీతలపానీయాల అమ్మకం తదితర వాటికి ఈనెల 5 సాయంత్రం లోపు టెండర్లు వేయాలని ఇటీవల ప్రకటన జారీ చేశారు. ఈనెల 6న పర్సన్ ఇన్‌చార్జి, ఆర్జేడీ సమక్షంలో టెండర్లు ఓపెన్ చేయనున్నట్లు ఆ శాఖ వర్గాలు తెలిపాయి. అయితే అన్నింటిలోనూ తమ వాళ్లకే అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్యే అనుచరులు అల్టిమేటం జారీ చేసినట్లు సమాచారం. వే-బ్రిడ్జి, భోజనశాల ఏర్పాటు, ప్రతి వారం పేడ ఊడ్చడం, కట్టుతాళ్ల అమ్మకం లాంటి నాలుగింటిలో మరెవరూ కూడా పోటీ ఉండకూడదనేలా ఒత్తిళ్లు తీసుకురావడంతో టెండర్లు వేయడానికి వెనుకాడుతున్నారు. కొందరికైతే టెండరు ఫారాలు కూడా ఇవ్వలేదని తెలిసింది. బీజేపీ, జనసేన అంటున్నా కూడా నో అంటున్నట్లు సమాచారం. మొత్తమ్మీద రింగ్ కావడం, సిండికేట్ లాంటి వాటితో టెండర్లు అన్నింటా టీడీపీ నేతల అనుచర వర్గాలు దక్కించుకునే పరిస్థితి నెలకొన్నట్లు చెబుతున్నారు. అయితే అలాంటిదేమీ లేదని సెలెక్షన్ గ్రేడ్ సెక్రటరీ ఆర్.జయలక్ష్మి తెలపడం గమనార్హం.

'మిత్ర'ద్రోహమా..!

రాష్ట్రంలో ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం కొలువుతీరింది. దీంతో ఆయా పార్టీల నేతలు ఆదాయ మార్గాలపై దృష్టి సారించారు. అయితే, అన్నింటా సమానత్వం పాటించాల్సిన టీడీపీ నాయకులు మాత్రం మిగిలిన రెండు పార్టీల నాయకులను అప్పుడే దూరం పెట్టడం గమనార్హం. ప్రభుత్వం ఏర్పడి కొన్ని రోజులైనా కాకమునుపే మిత్రద్రోహం తలపెడుతుండడంపై జనసేన, బీజేపీ నాయకులు లోలోనే కుమిలిపోతున్నట్లు తెలిసింది.


నూతన పద్ధతులతో అధిక దిగుబడులు



రైతులకు పరికరాలు అందజేస్తున్న డాక్టర్ విజయ శంకర్‌బాబు

బుక్కరాయసముద్రం: రైతులు పంటల సాగులో నూతన పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ శంకర్‌బాబు పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని రేకులకుంటలో ఉన్న వ్యవసాయ పరిశోధన స్థానంలో అఖిల భారత నూనె గింజల పరిశోధన పథకం, ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన స్థానం ఆధ్వర్యంలో షెడ్యూలు కులాలకు చెందిన రైతులకు వ్యవసాయ పరికరాలు, టార్పాలిన్ పట్టలు, ఆముదం విత్తనాలను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయ శంకర్‌బాబు మాట్లాడుతూ మెట్ట పంటల సాగులో మెలకువలు పాటిస్తే మంచి దిగుబడి లభిస్తుందన్నారు. నూతన ఆముదం (సకంర రకం ఐసీహెచ్-5) విత్తనం అనువైనదన్నారు. కార్యక్రమంలో డాక్టర్ దుర్గా ప్రసాద్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం మాది.. ఎండీఎంలూ మావే!



పాఠశాల మధ్యాహ్న ఏజెన్సీని మార్పు చేయాలంటూ గ్రామపెద్దల పేరుతో చేసిన తీర్మానమిది. స్వయంగా ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ నియోజకవర్గ పరిధిలోని బెళుగుప్ప మండలం గంగవరం ప్రాథమిక పాఠశాలలో దాదాపు 20 ఏళ్లుగా సరస్వతి అనే మహిళ మధ్యాహ్న భోజన ఏజెన్సీ (ఎండీఎం)ని నిర్వహిస్తున్నారు. ఈమెకు భర్త లేడు. కూతురు చనిపోవడంతో ఆమె ఇద్దరు పిల్లలు కూడా అమ్మమ్మ సరస్వతి వద్దే ఉంటున్నారు. కేవలం ఈ ఏజెన్సీపైనే ఆధారపడి ఆమె జీవనం సాగిస్తోంది. అయితే ఆమెను తప్పించి జి.లక్ష్మి. కె.యాస్మిన్‌కు బాధ్యతలు అప్పగించేలా స్థానిక టీడీపీ నాయకులు పావులు కదిపారు. ఇందుకు గ్రామ పెద్దల తీర్మానం పేరుతో ఓ లేఖను జత చేసి పాఠశాల హెచ్‌ఎంకు అందజేశారు. ... ఈ పరిస్థితి ఒక్క గంగవరం పాఠశాల ఎండీఎంపైనే కాదు... ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాల్లోనూ కనిపిస్తోంది.



- పరాకాష్టకు చేరుకున్న టీడీపీ నేతల అరాచకాలు
- అకారణంగా మధ్యాహ్న భోజన ఏజెన్సీలను తప్పించి తమ పార్టీ సానుభూతిపరులకు కట్టబెడుతున్న వైనం
- గ్రామ పెద్దల తీర్మానమంటూ అధికారులపై ఒత్తిళ్లు

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లా వ్యాప్తంగా మధ్యాహ్న భోజన ఏజెన్సీలను మార్చాలంటూ అధికారులపై ఒత్తిళ్లు మొదలయ్యాయి. రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం ఏర్పాటైన అనతి కాలంలోనే ఎండీఎం ఏజెన్సీలపై కన్నేసింది. 'ఈ ప్రభుత్వం మాది... ఇక్కడ మా వాళ్లే పనిచేస్తారు. మీరందరూ ఇక్కడి నుంచి వెళ్లిపోండి' అంటూ దౌర్జన్యాలకు తెరదీశారు. ఈ క్రమంలో గ్రామ పెద్దల తీర్మానమంటూ ఓ లేఖను జత చేసి హెచ్‌ఎంలకు ఇవ్వడం... అదే ఉత్సాహంతో వారు కూడా జిల్లా స్థాయి అధికారులకు నివేదికలు అందజేయడం పరిపాటిగా మారింది.

జీ..హుజూర్ అంటున్న అధికారులు..

పాఠశాలల్లో మధ్యాహ్న భోజన ఏజెన్సీల మార్పుపై టీడీపీ నేతల కంటే కొందరు మండల విద్యాశాఖాధికారులే అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నట్లుగా తెలుస్తోంది. అధికార పార్టీ నేతలకు భజనపరులుగా మారిన కొందరు ఎంఈఓలకు జిల్లాస్థాయి విద్యాశాఖ అధికారులు అండగా ఉంటున్నారు. అధికార పార్టీ నాయకులు ఏది చెప్పినా కాదనకుండా జీ హుజూర్ అంటూ చకచకా సంతకాలు పెట్టేస్తున్నారు. ఈ క్రమంలో స్వయంగా ప్రధానోపాధ్యాయులకు ఫోన్లు చేసి ఫలానా వారికి ఎండీఎం ఏజెన్సీ ఇచ్చేలా తీర్మానం చేసి నివేదికలు పంపాలని మౌఖిక ఆదేశాలు జారీ చేస్తున్నారు. ఒత్తిళ్లు తాళలేక విధిలేని పరిస్థితుల్లో గ్రామస్తులతో మాట్లాడి నివేదికలు సిద్ధం చేసి ఇస్తున్నామంటూ పలువురు హెచ్‌ఎంలూ వాపోతున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, పేరెంట్స్ కమిటీ సభ్యులతో సంబంధం లేకుండా మొత్తం ఈ ప్రక్రియను నడిపిస్తుండడం గమనార్హం.

బెదిరింపులు... దౌర్జన్యాలు..

మధ్యాహ్న భోజన ఏజెన్సీల మార్పునకు సహకరించిన నిర్వాహకులపై టీడీపీ నేతలు దౌర్జన్యాలు దిగుతున్నారు. బెదిరింపులకు పాల్పడుతున్నారు.

- రాయదుర్గం నియోజకవర్గ పరిధిలోని బొమ్మనహాల్ మండలం ఉద్దేహాల్ పాఠశాలకు కొందరు స్థానిక టీడీపీ నాయకులు వెళ్లి ఎండీఓ నిర్వాహకురాలు రామాంజనమ్మను బెదిరించారు. రేపటి నుంచి పాఠశాలకు రావొద్దని ఆమెకు సంబంధించిన వంట సామగ్రి ఏదైనా ఉంటే వెంటనే ఎత్తుకెళ్లాలంటూ హెచ్చరించారు. ఈమెకు భర్త లేడు. ఈ ఏజెన్సీపైనే ఆధారపడి జీవిస్తోంది.
- వజ్రకరూరు మండలం ఛాయాపురం, పొట్టిపాడు గ్రామాల్లోని పాఠశాలలకు మూడు రోజుల కిందట పదుల సంఖ్యలో స్థానిక టీడీపీ నాయకులు వెళ్లి ఎండీఎం ఏజెన్సీ నిర్వాహకులను బెదిరించారు. వెంటనే ఖాళీ చేయాలని లేదంటే బలవంతంగా గెంటేస్తామంటూ దుర్భాషలాడారు. అయినా మాట వినకపోవడంతో గురువారం ఛాయాపురం పాఠశాల ఎండీఎం ఏజెన్సీ నిర్వాహకురాలు సుంకమ్మపై దాడికి పూనుకుని వంటపాత్రలను బయటకు విసిరేశారు. మనస్తాపానికి గురైన ఆమె దిక్కుతోచని స్థితిలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది.
- ఆత్మకూరు మండలం సనప, యాలేరు, సిద్ధారాంపురం, ముట్టాల, ఆత్మకూరు సౌత్, నార్త్ పాఠశాలలు, బొమ్మనహాల్ మండలం ఉద్దేహాల్, గోవిందవాడ జిల్లా పరిషత్ పాఠశాల, శింగనమల మండలం తరిమెల, తాడిపత్రి మండలం వంగనూరు, గార్లదిన్నె మండలం కొప్పలకొండ గ్రామ పాఠశాలల్లోనూ ఎండీఎం ఏజెన్సీ నిర్వాహకులపై బెదిరింపులు తారాస్థాయికి చేరుకున్నాయి.
- కదిరి నియోజకవర్గం తలుపుల మండలం కుర్లి గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రభావతమ్మ అనే మహిళ దాదాపు 20 ఏళ్లుగా మధ్యాహ్న భోజన ఏజెన్సీని నిర్వహిస్తోంది. ప్రారంభం నుంచి ఇప్పటి వరకూ ఈ ఏజెన్సీపై ఎలాంటి ఆరోపణలు, ఫిర్యాదులూ లేవు. ఈ క్రమంలో వారం రోజులుగా కొందరు స్థానిక టీడీపీ నేతలు ఆ పాఠశాలకు వెళుతూ తమ పార్టీ అధికారంలోకి వచ్చింది కాబట్టి ఏజెన్సీని వదులుకుని వెళ్లాలని ఒత్తిడి పెంచారు. శుక్రవారం (నేడు) నాటికి తప్పుకోకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరికలు జారీ చేశారు.
- ఎండీఎం ఏజెన్సీలపై అధికార పార్టీ నేతల బెదిరింపులు, దౌర్జన్యాలు మితిమీరి పోయాయని రానున్న రోజుల్లో ఇంకా ఎన్ని ఘోరాలు చూడాల్సి వస్తుందోనని ఎండీఎం ఏజెన్సీ కార్మిక సంఘ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఎవరినీ వదలడం లేదు..

శ్రీసత్యసాయి జిల్లాలో 2,018 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీలు నడుస్తున్నాయి. అలాగే అనంతపురం జిల్లాలో మొత్తం 1,582 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీలు నడుస్తున్నాయి. అలాగే మరి కొన్ని పాఠశాలలను స్వచ్ఛంద సంస్థలు దత్తతకు తీసుకుని మధ్యాహ్న భోజనాన్ని సరఫరా చేస్తున్నాయి. కాగా, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చాలా ఏజెన్సీలు ఈ పథకం ప్రారంభమైన 2003 నుంచి కొనసాగుతూ వస్తున్నాయి. అప్పట్లో వీరికి పైసా ఆదాయం లేకపోయినా ఎంతో నమ్మకంతో పని చేస్తూ వచ్చారు. అలాంటి ఏజెన్సీలను కూడా ఈ రోజు తప్పిస్తున్నారు. చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చేతులెత్తేస్తున్నారు. రాజకీయ పార్టీలకు సంబంధం లేని తమలాంటి వారిని అకారణంగా తొలిగిస్తున్నారని పలువురు కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

జేఎన్‌టీయూలో హెల్ప్‌లైన్ సెంటర్



సెంటర్‌ను పరిశీలిస్తున్న జేఎన్‌టీయూ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ సత్యనారాయణ

అనంతపురం: ఏపీ ఈఏపీసెట్ హెల్ప్‌లైన్ సెంటర్‌ను జేఎన్‌టీయూ(ఏ)లో గురువారం ఏర్పాటు చేశారు. ఈ సెంటర్‌ను జేఎన్‌టీయూఏ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్వీ సత్యనారాయణ పరిశీలించారు. హెల్ప్‌లైన్ ప్రక్రియ ఎలా నిర్వహిస్తున్నారని ఆరా తీశారు. వివిధ అంశాలను ఆయనకు జేఎన్‌టీయూ(ఏ) డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ ఆర్.కిరణ్మయి వివరించారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యుడు డాక్టర్ ఎం.రామశేఖర్ రెడ్డి, వర్సిటీ డైరెక్టర్లు ప్రొఫెసర్ ఎస్వీ సుబ్బారెడ్డి, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఐరన్ ఓర్‌పై కన్నేశారు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన అతి కొద్ది రోజుల్లోనే అడ్డగోలుగా దోచుకునేందుకు స్థానిక టీడీపీ నేతలు సిద్ధమయ్యారు. తాజాగా కర్ణాటక సరిహద్దున ఉన్న రాయదుర్గం నియోజకవర్గం డి.హీరేహాళ్, బొమ్మనహాళ్ మండలాల్లోని ఐరన్‌ఓర్ ఫ్యాక్టరీలు, సోములాపురం వద్ద ఉన్న రైల్వే యార్డులో వ్యాగన్ల ఆన్‌లోడింగ్‌పై కన్నేశారు. ఫ్యాక్టరీల్లో ఐరన్ ఉత్పత్తితో పాటు వ్యాగన్లలో రైల్వే యార్డుకు చేరిన బొగ్గు, ఇతర ముడి సరుకును రోజూ లారీల్లో ఫ్యాక్టరీలకు సరఫరా చేస్తుంటారు. రోజూ రూ.లక్షల్లోనే లావాదేవీలు జరుగుతుంటాయి. ఈ క్రమంలో ఐరన్ ఓర్ ఫ్యాక్టరీల నుంచి మాముళ్ల వసూలుతో పాటు రైల్వే యార్డును తమ ఆధీనంలోకి తీసుకుని తాము ఏర్పాటు చేసిన లారీల ద్వారానే సరుకు రవాణా చేయాలంటూ ఒత్తిళ్లు తీవ్రతరం చేశారు. కాదూకూడదంటే యార్డులో పనిచేస్తున్న వారిని తప్పించేందుకు సైతం వెనుకాడడం లేదు. అగ్రిమెంట్ ఉండే వరకైనా తమకు అవకాశం కల్పించాలని పాత ట్రాన్స్‌పోర్టర్లు విజ్ఞప్తి చేస్తున్నా ససేమిరా అంటున్నారు. ఈ క్రమంలో ఆగమేఘాలపై టీడీపీ సానుభూతిపరుడితో రైల్వే యార్డు సమీపంలో కాటా మిషన్ కూడా సిద్ధం చేశారు.

మా బతుకులకు గ్యారంటీ ఏదీ?

- డీఆర్‌ఓకు గుంతకల్లు షికారీల వేడుకోలు
- దాడులు... దౌర్జన్యాలు పెచ్చుమీరాయంటూ ఆందోళన
- అనుక్షణమూ భయంతోనే జీవిస్తున్నామని ఆవేదన

అనంతపురం అర్బన్: ఓ వైపు సొంత సామాజిక వర్గానికి చెందిన కొందరి దౌర్జన్యం.. మరో వైపు పోలీసుల దాడులతో అనుక్షణమూ భయంతోనే జీవిస్తున్నామని, తెల్లారి లేస్తే సూర్యుడిని చూస్తామనే గ్యారంటీ కూడా తమ వద్ద లేదని గుంతకల్లుకు చెందిన షికారీలు వాపోయారు. తమ గోడును కలెక్టర్‌తో చెప్పుకునేందుకు గురువారం వారు కలెక్టరేట్‌కు వచ్చారు. ఈ సందర్భంగా షికారీ కాలనీ వాసులు మాట్లాడుతూ... గుంతకల్లులోని షికారీ బెంచి కాలనీలో 70 ఏళ్లుగా వంద కుటుంబాలు నివసిస్తున్నాయన్నారు. ఇందులో ఓ పక్కన ఉన్న నివాసముంటున్న15 కుటుంబాల్లో ఆరు కుటుంబాలకు చెందిన వారు గంజాయి, కర్ణాటక మద్యం బుడ్డీలు అమ్ముతారన్నారు. ఈ ఆరు కుటుంబాల వారు మిగిలిన 85 కుటుంబాలపై దౌర్జన్యం చేస్తూ అడ్డు వచ్చిన వారిపై విచక్షణారహితంగా దాడి చేస్తున్నారని వాపోయారు. దీనిపై పోలీసులుకు ఫిర్యాదు చేస్తే వారు సైతం తమపైనే భౌతిక దాడి చేస్తున్నారని కన్నీటి పర్యంతమయ్యారు. రోజురోజుకూ వారి దౌర్జన్యం, పోలీసుల వేధింపులతో బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నామని, తమ బతుకులకు గ్యారంటీ ఇవ్వాలంటూ డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డిని కలసి వినతిపత్రం అందజేశారు. సమస్యపై డీఆర్‌ఓ స్పందిస్తూ గుంతకల్లు డీఎస్పీతో ఫోన్‌లో మాట్లాడారు. విషయం వివరించి సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలని సూచించారు.



కలెక్టర్‌ను కలిసేందుకు వచ్చిన షికారీలు

పశువుల్లో పోషక లోపాలపై దృష్టి పెట్టండి



పాడి రైతులకు మందులు పంపిణీ చేస్తున్న దృశ్యం

రాప్తాడు: భవిష్యత్తులో లింగ నిర్ధారిత వీర్యం అత్యధిక ప్రాచుర్యం పొందుతుందని, అత్యధిక పాడి సేకరణలో భాగంగా పెయ్య దూడలు మాత్రమే జన్మించేలా ఆధునిక సాంకేతిక విప్లవంగా ఆవిర్భవిస్తుందని జిల్లా పశుగణాభివృద్ధి కార్యనిర్వహణ అధికారి, డిప్యూటీ డైరెక్టర్ సుధాకర్ అన్నారు. రాప్తాడు మండలం భోగినేపల్లి గ్రామంలో గురువారం నిర్వహించిన ఉచిత గర్భకోశ చికిత్స శిబిరాన్ని ఆయన పరిశీలించి, మాట్లాడారు. పాడి పశువుల్లో మంచి కట్టు శాతం రావడానికి స్థానికంగా లభ్యమయ్యే సుబాబుల్ ఆకును వాడాలన్నారు. పశువులు ఈనిన మూడు నెలల్లోపే కృత్రిమ గర్భధారణ చేయించాలని, ఎద సూది వేసిన తర్వాత 20 రోజుల పాటు బెల్లం నీళ్లు తాపించాలన్నారు. రోజుకు 100 గ్రాముల ఎముకల పొడి మేపాలన్నారు. పశువుల్లో సరైన పోషణకు పచ్చి మేత, దాణాతో పాటు కొండ చిగిరాకు, మునగాకు, కరివేపాకు, మొలకెత్తిన పెసలు, ఉలవలు, సద్దలు, రాగులు మేపితే హార్మోన్స్, పోషకార లోపాలు లేకుండా త్వరగా చూలు కట్టించవచ్చన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు, రైతులు పాల్గొన్నారు.

యువకుడి దుర్మరణం

కళ్యాణదుర్గం రూరల్: ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడిన ఘటనలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... బళ్లారి ప్రాంతానికి చెందిన గాదిలింగ (28), వీరేష్ గురువారం కళ్యాణదుర్గంలోని నర్సరీలో మిరప నారు విత్తనాలు ఇచ్చి ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమయ్యారు. గూబనపల్లి వద్దకు చేరుకోగానే ఎదురుగా వెళుతున్న మరో బైక్‌ను ఓవర్‌టేక్ చేసే క్రమంలో వేగాన్ని నియంత్రించుకోలేక అదుపు తప్పి కిందపడ్డారు. బైక్ నడుపుతున్న గాదిలింగ తీవ్రంగా, వీరేష్ స్వల్పంగా గాయపడ్డారు. అటుగా వెళుతున్న వారు క్షతగాత్రులను వెంటనే స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. అప్పటికే గాదిలింగ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

చిరుద్యోగులపై వేధింపులు మానుకోండి


- టీడీపీ నేతలకు సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ హితవు



అనంతపురం అర్బన్: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం అండ చూసుకుని చిరుద్యోగులపై వేధింపులకు పాల్పడడం సరికాదని టీడీపీ నేతలకు సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ హితవు పలికారు. జిల్లా కేంద్రంలోని గణేనాయక్ భవన్ (సీపీఎం కార్యాలయం)లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వజ్రకరూరు మండలం ఛాయాపురం గ్రామంలో స్థానిక టీడీపీ నాయకుల వేధింపుల కారణంగా మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకురాలు సుంకమ్మ పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చావుబతుకుల మధ్య గుంతకల్లు ఆస్పత్రిలో చికిత్స పొందుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లావ్యాప్తంగా ఈ రకమైన వేధింపులు నానాటికీ పెరిగిపోతున్నాయన్నారు. రాజీనామాలు చేయాలంటూ మధ్యాహ్న భోజన ఏజెన్సీలు, ఆశ కార్యకర్తలు, మునిసిపల్ కాంట్రాక్ట్ కార్మికులు, శ్రీరామరెడ్డి నీటి పథకం కార్మికులపై ఆయా మండలాల్లో అధికార పార్టీ నాయకులు బెదిరింపులకు దిగుతుండడం సిగ్గు చేటన్నారు. అధికార పార్టీ నాయకుల బెదిరింపులకు సంబంధించి కొన్ని ఘటనలు తమ దృష్టికి వచ్చాయన్నారు. ప్రధానంగా విడపనకల్లు మండలం జనార్దనపల్లిలో ఆశ కార్యకర్త నాగమణిని విధులకు రావొద్దని బెదిరించారన్నారు. అలాగే రాజీనామా చేయాలంటూ బెళుగుప్పలో ఆశ కార్యకర్తపై ఒత్తిడి చేస్తున్నారన్నారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీని తమకు అప్పగించాలంటూ బెళుగుప్ప మండలం గంగవరం, ఆత్మకూరు మండలం సనప, యాలేరు, సిద్ధారాంపురం, ముట్టాల, ఆత్మకూరు సౌత్, నార్త్ పాఠశాలలు, బొమ్మనహాల్ మండలం ఉద్దేహాల్, గోవిందవాడ జిల్లా పరిషత్ పాఠశాల, శింగనమల మండలం తరిమెల, తాడిపత్రి మండలం వంగనూరు, గార్లదిన్నె మండలం కొప్పలకొండ గ్రామాల్లో బెదిరింపులు తారాస్థాయికి చేరుకున్నాయన్నారు. తాడిపత్రి మున్సిపాలిటీలో ఇస్మాయిల్ అనే కార్మికుడిని పనులకు హాజరు కాకుండా అడ్డుకున్నారన్నారు. మరికొందరిని పిలిపించి పనుల్లో నుంచి తప్పుకోవాలంటూ బెదిరిస్తున్నారన్నారు. టీడీపీ నేతల అరాచకాలపై జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు తక్షణం జోక్యం చేసుకుని నివారించాలని డిమాండ్ చేశారు.

'నీట్'ను రద్దు చేయాలి


- అక్రమాలపై కేంద్ర ప్రభుత్వాన్ని ఏపీ ప్రభుత్వం నిలదీయాలి
- ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ విజయవంతం



విద్యా సంస్థల బంద్‌లో పాల్గొన్న ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: వైద్య విద్య ప్రవేశాలకు ఇటీవల నిర్వహించిన నీట్ (ఉమ్మడి ప్రవేశ పరీక్ష)ను రద్దు చేయాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. నీట్ (నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్) ప్రశ్న పత్రాల లీకేజీని నిరసిస్తూ దేశ వ్యాప్త విద్యా సంస్థల బంద్‌లో భాగంగా గురువారం జిల్లాలో ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన విద్యా సంస్థల బంద్ విజయవంతమైంది. నగరంలోని వివిధ ప్రైవేట్, ప్రభుత్వ విద్యా సంస్థలు మూతపడ్డాయి. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి కుళ్లాయిస్వామి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎనుమల నరేష్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి వీరేంద్ర ప్రసాద్, ఏఐఎస్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు వేమన, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి సురేష్‌యాదవ్, పీఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ అలాం, వీఎస్ఐవీ రాష్ట్ర కార్యదర్శి వినోద్‌కుమార్, ఏపీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సాయికుమార్ మాట్లాడారు. నీట్ నిర్వహణలో కొందరు విద్యార్థుల నుంచి రూ. 30 లక్షల చొప్పున వసూలు చేసి ప్రశ్న పత్రాలు లీక్ చేసినట్లుగా బహిరంగంగా చెబుతున్నా... సంబంధీకులపై చర్యలు తీసుకోకుండా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. ఇప్పటికే దక్షిణాది రాష్ట్రాలు నీట్‌ను రద్దు చేయాలంటూ అసెంబ్లీల్లో తీర్మానాలు సైతం చేశాయన్నారు. అయితే ఏపీ ప్రభుత్వం నీట్ ప్రశ్న పత్రాల లీకేజీపై నోరు మెదపకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. ఈ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిలదీయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. లీకేజీకి నైతిక బాధ్యత వహించి కేంద్ర విద్యాశాఖ మంత్రి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నీట్‌ను నిర్వహించిన ఎన్టీఏను రద్దు చేయకపోతే ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు రమణయ్య, ప్రతిభా భారతి, మంజునాథ్, ఉమామహేష్, వంశీ, హరికృష్ణ, సోము, నాని, ఓబులేసు, బాలకృష్ణ, పవన్, రారాజు, హరికృష్ణ పాల్గొన్నారు.

చికెన్ దుకాణాలు తెరవొద్దు



గ్రామంలో విచారణ చేస్తున్న ఎస్ఐ ఆంజనేయులు

కంబదూరు: మండలంలోని అచ్చంపల్లిలో బుధవారం కోడి కూర తిని బాలుడు పెద్ద ముత్యాలప్ప మృతి చెందిన ఘటనపై ఎస్ఐ ఆంజనేయులు గురువారం విచారణ చేపట్టారు. గ్రామానికి చేరుకున్న ఆయన తొలుత బాలుడి తల్లిదండ్రులు శ్రీనివాసులు, శ్రీలక్ష్మిని కలసి ఘటనపై ఆరా తీశారు. చికెన్ తినడం వల్లనే బాలుడు మృతి చెందాడని, అలాగే చాలా మంది వాంతులు, విరేచనాలతో అనారోగ్యం బారిన పడ్డారని ఈ సందర్భంగా ఆయన దృష్టికి గ్రామస్తులు తీసుకెళ్లారు. దీంతో అనారోగ్యానికి కారణమైన చికెన్ దుకాణాలను కొద్ది రోజుల పాటు తెరవకూడదంటూ నిర్వాహకులను ఎస్ఐ ఆదేశించారు.

సుంకమ్మపై ప్రవర్తించిన తీరు దుర్మార్గం



సుంకమ్మను పరామర్శిస్తున్న సీఐటీయూ అధ్యక్షురాలు నాగమణి

వజ్రకరూరు: మండలంలోని ఛాయాపురం ప్రభుత్వ పాఠశాలలో ఎండీఎం నిర్వాహకురాలు బోయ సుంకమ్మపై టీడీపీ నాయకులు ప్రవర్తించిన తీరు చాలా దుర్మార్గంగా ఉందని సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు ఎం.నాగమణి మండిపడ్డారు. గుంతకల్లు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సుంకమ్మను ఆమెతో పాటు ఎండీఎం నిర్వాహకుల సంఘం జిల్లా అధ్యక్షురాలు జయమ్మ, మండల అధ్యక్షురాలు రంగమ్మ సీఐటీయూ ఉపాధ్యక్షురాలు రమాదేవి, మండల కార్యదర్శి విరూపాక్షి, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రంగారెడ్డి, తదితరులు గురువారం పరామర్శించారు. ఘటన జరిగిన తీరు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ... జిల్లా వ్యాప్తంగా ఎండీఎం నిర్వాహకులపై టీడీపీ నేతలు సాగిస్తున్న అరాచకాలను ఇప్పటికే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. దాడులను తక్షణం ఆపకపోతే ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పామిడి పోలీస్‌స్టేషన్‌లో ఉంచిన ఇసుక ట్రాక్టర్లు

పామిడి: ఎలాంటి అనుమతులు లేకుండా స్థానిక పెన్నానది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను బుధవారం అర్ధరాత్రి పామిడి పోలీసులు పట్టుకున్నారు. ముందస్తు సమాచారంతో అప్రమత్తమైన సీఐ రాజశేఖర్‌రెడ్డి నేతృత్వంలో ఎస్ఐ బెస్తరాజు, సిబ్బంది తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లు పట్టుబడ్డాయి. స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి, తరలింపుదారులపై కేసు నమోదు చేశారు.

జెడ్పీ ఉద్యోగులకు సెక్షన్ల మార్పు

అనంతపురం సిటీ: జిల్లా పరిషత్ కార్యాలయంలో పలువురు ఉద్యోగులకు సెక్షన్లు మార్చారు. ఈ మేరకు డిప్యూటీ సీఈఓ కె.లలితాబాయి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలనా సౌలభ్యం కోసం కొందరికి సెక్షన్లు మార్చాల్సి వచ్చిందని పేర్కొన్నారు. మార్చిన సెక్షన్లు గురువారం నుంచే అమలులోకి వస్తాయన్నారు. ఈ క్రమంలో జీ-2 సెక్షన్ సీనియర్ అసిస్టెంట్ టి.మేఘయాను జీ-1కు, డీ-1 నుంచి సీనియర్ అసిస్టెంట్ ఎంవీ రమేష్‌బాబును ఎఫ్-2కు, సీఈఓ పేషీలో ఉన్న జూనియర్ అసిస్టెంట్ కె.మనీష్‌కుమార్‌ను జీ-2కు, ఎఫ్-2 నుంచి డి. మాధవిని డీ-1కు మార్చారు.

మెనూ సక్రమంగా అమలు చేయండి



నిత్యావసర సరకులు పరిశీలిస్తున్న నార్పల తహసీల్దార్ లక్ష్మీనారాయణ

అనంతపురం రూరల్: వసతి గృహాల్లోని విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనాన్ని అందించాలని వార్డెన్లకు అనంతపురం, నార్పల తహసీల్దార్లు శివరామిరెడ్డి, లక్ష్మీనారాయణ సూచించారు. గురువారం ఉదయం అనంతపురంలోని బీసీ సంక్షేమశాఖ వసతి గృహం-2, బీసీ కళాశాల (నార్పల) వసతి గృహాన్ని వారు ఆకస్మిక తనిఖీ చేశారు. నిత్యావసర సరుకుల నిల్వలతో పాటు వసతి గృహాల పరిసరాలను పరిశీలించారు. బాలికల వసతి గృహంలోకి బయటి వ్యక్తులను అనుమతించరాదన్నారు. అనుమతి ఉన్న విద్యార్థినిలను మాత్రమే బయటికి పంపాలన్నారు. వార్డెన్లు సైతం స్థానికంగానే నివాసముంటూ విద్యార్థులపై నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. కార్యక్రమంలో నార్పల డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీనరసింహ పాల్గొన్నారు.

జలశక్తి అభియాన్ పనుల పరిశీలన



వివరాలు తెలుసుకుంటున్న కేంద్ర బృందం సభ్యుడు అరులా నందన్

బుక్కరాయసముద్రం: మండలంలోని దండువారిపల్లిలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులను కేంద్ర జలశక్తి అభియాన్ బృందం సభ్యుడు, సెంట్రల్ నోడల్ ఆఫీసర్ అరులా నందన్, డ్వామా పీడీ వేణుగోపాలరెడ్డి గురువారం పరిశీలించారు. ఫారం పాండ్‌లు, మినీ అమృత్ సరోవర్ పనుల్లో నాణ్యతను తనిఖీ చేశారు. ఈ పనుల్లో ఎంత మంది కూలీలు పాల్గొన్నారు. ఎంత మొత్తం బిల్లులు చెల్లించారని వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టెక్నికల్ ఆఫీసర్ షరీఫ్‌ఖాన్, ఏపీడీ శైలజ, ఏపీఓ పోలేరయ్య, ఈసీ, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

28న మల్లెల కవితా సంపుటాల ఆవిష్కరణ

అనంతపురం కల్చరల్: జలస్వప్నం కవి మల్లెల నరసింహమూర్తి కలం నుంచి జాలువారిన మట్టి తంబూర, మాకూ ఒక నది కావాలి కవితా సంపుటాలను ఈనెల 28న ఆవిష్కరించనున్నారు. స్థానిక ఎస్ఎస్‌బీఎన్ ఆడిటోరియంలో ఉదయం 10 గంటల నుంచి విమలాశాంతి సాహిత్య సాంస్కృతిక సేవా సమితి ఆధ్వర్యంలో జరిగే సాహితీ కార్యక్రమంలో సాహిత్యాభిమానులందరూ పాల్గొనాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

మొక్కలు నాటుదాం



ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మొక్క నాటుతున్న అధికారులు

ఆత్మకూరు: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షిద్దామని ఎంపీడీఓ దశరథ రామయ్య తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో సిబ్బందితో కలిసి మొక్కలు నాటి, నీరు పోశారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత కూడా తీసుకోవాలని సూచించారు. మొక్కలు నాటడం వల్ల పర్యావరణ కాలుష్యం తగ్గి వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది జయరాం, భరత్ తదితరులు పాల్గొన్నారు.

డయేరియా నివారణ చర్యలు చేపట్టాలి



మేయర్ వసీంకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

అనంతపురం కార్పొరేషన్: నగరంలో డయేరియా నివారణ చర్యలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని మేయర్ వసీంకు సీపీఎం నాయకులు విన్నవించారు. గురువారం నగరపాలక సంస్థలో మేయర్ వసీంను కలిసి వినతిపత్రం అందించారు. తాగునీటి సరఫరాలో ఎటువంటి నిర్లక్ష్యం లేకుండా చూడాలన్నారు. డయేరియా ప్రబలుతున్న రోజుల్లో నీటి ట్యాంకులను శుభ్రం చేయించడంతో పాటు ఎప్పటికప్పుడు తాగునీటి పరీక్షలు చేయించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ ఒకటవ నగర కార్యదర్శి రామిరెడ్డి, నాయకులు వెంకట నారాయణ, బాలకృష్ణ, మసూద్, వెంకటేష్, నూరుల్లా, ఆటో యూనియన్ శివ, ఇస్మాయిల్, తదితరులు పాల్గొన్నారు.

టెట్, డీఎస్సీ ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలి

అనంతపురం ఎడ్యుకేషన్: టెట్, డీఎస్సీ పరీక్షలు ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలని హిందీ సేవా సదన్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి, యూత్ ఎడ్యుకేషన్ ఎంప్లాయిమెంట్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.గైబువల్లి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. టెట్, డీఎస్సీ పరీక్షలు ఆన్‌లైన్‌లో నిర్వహించడం వల్ల ఒకే కేటగిరీకి చెందిన అభ్యర్థులకు వేర్వేరు ప్రశ్నపత్రాలు వస్తాయన్నారు. పరీక్షల నిర్వహణకు కనీసం 15 రోజులు పడుతుందన్నారు. పరీక్ష కేంద్రాలు లేక అభ్యర్థులు గతంలో ఇతర రాష్ట్రాలకు వెళ్లి అనేక ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. కొంతమందికి కఠినంగా ప్రశ్నపత్రం రావడం వల్ల మార్కులు తక్కువ వచ్చాయని తెలిపారు. మరికొందరికి సులభంగా రావడం వల్ల ఎక్కువ మార్కులు వచ్చాయని గుర్తు చేశారు. ఒకే కేటగిరీ, ఒకే సబ్జెక్టుకు పరీక్షలు రాసే టెట్, డీఎస్సీ అభ్యర్థులకు సమాన న్యాయం జరగాలంటే ఆఫ్‌లైన్ పరీక్ష నిర్వహించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు.

యాచకుడి మృతి



రైల్వే స్టేషన్ ఆవరణలో ఉన్న యాచకుడి మృతదేహం

అనంతపురం సిటీ: అనంతపురం రైల్వే స్టేషన్ ఆవరణలోని పార్శిల్ సర్వీసు కార్యాలయం ఎదుట ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గురువారం సాయంత్రం గుర్తించారు. చాలా రోజుల నుంచి రైల్వే స్టేషన్ పరిసరాల్లో ఓ యాచకుడు భిక్షం కోసం తిరిగేవాడని సిబ్బంది తెలిపారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న యాచకుడి కదలికలు లేకపోవడం చూసిన వారు పోలీసులకు సమాచారం అందించారు. రైల్వే పోలీసులతో పాటు మూడో పట్టణ పోలీసులు కూడా అక్కడికి చేరుకుని పరిశీలించారు. అప్పటికే అతడు మృతిచెందినట్లు గుర్తించారు. అయితే మృతుడు ఎవరనేది తెలియడం లేదని పోలీసులు తెలిపారు. శుక్రవారం తదుపరి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

తెలుగు జాతి ముద్దుబిడ్డ 'అల్లూరి'



అల్లూరి వేషధారణలో ఉన్న చిన్నారితో కలెక్టర్ వినోద్‌కుమార్, ఎన్నికల పరిశీలకులు విలాస్ వి.షిండే తదితరులు



జేఎన్‌టీయూ(ఏ)లో జరిగిన అల్లూరి జయంతి వేడుకల్లో పాల్గొన్న ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ



ఓటీపీఆర్ఐలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఓటీపీఆర్ఐ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.దుర్గాప్రసాద్

అనంతపురం: దేశ స్వాతంత్య్రం కోసం బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా ఉద్యమించిన తెలుగుజాతి ముద్దుబిడ్డ అల్లూరి సీతారామ రాజు అని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం రెక్టార్ ప్రొఫెసర్ జి.వెంకట నాయుడు కొనియాడారు. గురువారం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో అల్లూరి సీతారామరాజు జయంతిని ఘనంగా నిర్వహించారు. తొలుత అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రెక్టార్ ప్రొఫెసర్ జి.వెంకట నాయుడు మాట్లాడుతూ.. స్వరాజ్యం కోసం మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు చేసిన పోరాటం ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. మహనీయుల త్యాగాలను ఎన్నటికీ మరువరాదన్నారు. అల్లూరి సీతారామరాజు నివసిస్తున్న ప్రాంతాల్లో ఉన్న గిరిజనుల జీవన విధానాన్ని గమనించి వారిలో చైతన్యం తీసుకొచ్చారని గుర్తు చేశారు. తెల్లదొరల దోపిడీని ఎదుర్కొనేందుకు గిరిజనులకు అండగా నిలిచి వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు కృషి చేశారన్నారు. కార్యక్రమంలో ఎస్కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ, లైబ్రరీ సైన్సెస్ విభాగాధిపతి ప్రొఫెసర్ దాశరథీ రవీంద్ర, క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూలో..

జేఎన్‌టీయూ అనంతపురం పాలక భవనంలో విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి నివాళులర్పించారు. జేఎన్‌టీయూ అనంతపురం ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ మాట్లాడుతూ.. అల్లూరి సీతారామరాజుకు చిన్నప్పటి నుంచి దైవభక్తి, నాయకత్వ లక్షణాలు, దానగుణం అధికంగా ఉండేవన్నారు. గిరిజనులు ఎదుర్కొంటున్న అన్యాయాలను ఎదురించేందుకు గిరిజనుల్లో ధైర్యాన్ని నింపారన్నారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూఏ వర్సిటీ డైరెక్టర్లు ప్రొఫెసర్ జీవీ సుబ్బారెడ్డి, ప్రొఫెసర్ వైశాలి, ప్రొఫెసర్ పద్మ సువర్ణ, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఈ.అరుణ కాంతి, పాలక మండలి సభ్యుడు డాక్టర్ ఎం.రామ శేఖర్ రెడ్డి, డాక్టర్ కళ్యాణి రాధ పాల్గొన్నారు.

ఓటీపీఆర్ఐలో..

ఓటీపీఆర్ఐలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి నివాళులర్పించారు. డైరెక్టర్ ప్రొఫెసర్ బి.దుర్గాప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై అల్లూరి సీతారామరాజు గొప్పతనం, జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు.

తెల్ల దొరల పాలిట సింహస్వప్నం సీతారామరాజు

అనంతపురం ఎడ్యుకేషన్: మన్యం వీరుడు, తెల్లదొరల పాలిట సింహస్వప్నం అల్లూరి సీతారామరాజు అని స్థానిక కేఎస్ఎన్ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శంకరయ్య కొనియాడారు. గురువారం అల్లూరి సీతారామరాజు జయంతిని కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. నేటి యువత అల్లూరి సీతారామరాజును ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అల్లూరి సీతారామరాజు అడుగుజాడల్లో నడవాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి బి.రామ కృష్ణ, చరిత్ర అధ్యాపకురాలు ఫాతిమాబేగం, వృక్షశాస్త్ర అధ్యాపకుడు రమణానాయుడు, శర్మ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న.. చిన్నారి అల్లూరి వేషధారణ

అనంతపురం అర్బన్: అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకుని గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన వేడుకల్లో ఓ చిన్నారి అల్లూరి వేషధారణ ఆకట్టుకుంది. రాణినగర్ అంగన్‌వాడీ-4కు చెందిన చిన్నారి ఫైజన్ అల్లూరి వేషధారణతో కార్యక్రమానికి హాజరయ్యాడు. కలెక్టర్ వి.వినోద్ కుమార్, ఎన్నికల వ్యయ పరిశీలకులు విలాస్ వి.షిండే చిన్నారిని అభినందించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి నరసమ్మ, తదితరులు పాల్గొన్నారు.



అల్లూరి చిత్రపటానికి పూలమాల వేస్తున్న కేఎస్ఎన్ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శంకరయ్య



ఎస్కేయూ ఇంజినీరింగ్ కళాశాలలో అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రెక్టార్ ప్రొఫెసర్ వెంకట నాయుడు

మొక్కలను సంరక్షించాలి

- కలెక్టర్ వినోద్ కుమార్



అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ వినోద్ కుమార్

అనంతపురం అర్బన్: మనం నాటిన మొక్కలను సంరక్షిస్తూ మహా వృక్షాలుగా ఎదిగేలా చూడాలి. అప్పుడే మన కర్తవ్యాన్ని నిర్వర్తించినట్లు అని కలెక్టర్ వి.వినోద్ కుమార్ అధికారులకు సూచించారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం ముందు భాగంలో అధికారులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భావితరాల భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి జిల్లాను హరితవనంగా తీర్చిదిద్దాలన్నారు. అనంతరం మొక్కలను సంరక్షిస్తామంటూ అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో నగర పాలక కమిషనర్ మేఘ స్వరూప్, ఆర్‌డీఓ జి.వెంకటేష్, నగర పాలక ఉద్యాన ఏడీ శ్రీలక్ష్మి, డీపీఆర్‌ఓ గురుస్వామి శెట్టి పాల్గొన్నారు.

రేపు ఉద్యోగ మేళా

అనంతపురం ఎడ్యుకేషన్: స్పందన స్ఫూర్తి ఫైనాన్స్ లిమిటెడ్ కంపెనీలో క్రెడిట్ అసిస్టెంట్ ఉద్యోగాల భర్తీకి ఈనెల 6న నగరంలోని ఉపాధి కల్పన శాఖ అధికారి కార్యాలయంలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి ఎ.కళ్యాణి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మొత్తం 100 పోస్టులు భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. 18–27 ఏళ్ల మధ్య ఉండి, ఇంటర్‌తో పాటు ఏదైనా గ్రాడ్యుయేట్ పూర్తి చేసిన యువకులు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన వారు ఉమ్మడి జిల్లాలో పని చేయాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి గల యువకులు బయోడేటా ఫారం, విద్యార్హతల ఒరిజినల్, జిరాక్స్ సర్టిఫికెట్లు, ఏదైనా ఐడీ ప్రూఫ్‌తో ఉదయం 10:30 గంటలకు జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి కార్యాలయానికి చేరుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 82474 86387 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

పరామర్శ



వైఎస్సార్‌సీపీ కార్యకర్త దాదు మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే అనంత

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని సూర్యనగర్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త దాదు గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న అనంతపురం మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి గురువారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని చెప్పారు. కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం చేశారు. అనంతరం వైఎస్సార్‌సీపీ కార్యకర్త దాదు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే వెంట కార్పొరేటర్ అబూసలేహ తదితరులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అభివృద్ధి భేష్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, చిత్రంలో మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నగరంలో అభివృద్ధి పనులు చాలా బాగా జరిగాయి. తమ ప్రభుత్వంలోనూ నగరాభివృద్ధికి నిధులు తీసుకొస్తాం. పాలకవర్గం సహకారంతో నగరాభివృద్ధికి అడుగులు వేస్తామని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం నగరపాలక సంస్థలో మేయర్ వసీం, కమిషనర్ మేఘస్వరూప్‌తో కలసి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మొదటగా స్వాతంత్య్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి నివాళులర్పించారు. నగరపాలక సంస్థలోని రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, శానిటేషన్, మెప్మా, తదితర విభాగాలకు సంబంధించిన పురోగతి, చేపడుతున్న పనులపై ఆయా అధికారులు తెలియజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నగరపాలక సంస్థ పాలకవర్గం రూ.750 కోట్లతో చేపట్టిన డీపీఆర్‌ను సీఎం చంద్రబాబుకు అందించినట్లు తెలిపారు.

కంపోస్టు యార్డు విచారణకు అభ్యంతరం లేదు

కంపోస్టు యార్డులో బయోమైనింగ్ ప్రాసెస్ ద్వారా చేపట్టిన చెత్త నిర్వహణ, అందుకు సంబంధించిన నిధుల చెల్లింపులు, తదితర వాటిపై విచారణకు ఎలాంటి అభ్యంతరం లేదు. విచారణ చేపట్టిన తర్వాతే సదరు ఏజెన్సీకి డబ్బులు చెల్లించాలని మేయర్ వసీం స్పష్టం చేశారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ప్రత్యేక చొరవతో 12.05 ఎకరాల్లో ఉన్న కంపోస్టు యార్డులో గత 40 ఏళ్లగా పేరుకుపోయిన 3.32,485 (3.32 లక్షల) మెట్రిక్ టన్నుల చెత్త నిర్వహణ చేపట్టేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ 2021 జనవరిలో రూ.26 కోట్లతో టెండర్లను ఆహ్వానించిందన్నారు. ఒక మెట్రిక్ టన్నుకు రూ.800 చెల్లించేలా టెండర్‌లో పొందుపర్చారన్నారు. 13 శాతం లెస్‌కు (ఒక మెట్రిక్ టన్నుకు రూ.689) హైదరాబాద్ నోవాస్ గ్రీన్ టెండర్ దక్కించుకుందన్నారు. రూ.22.09 కోట్లు అగ్రిమెంట్ కాగా, 2022 ఫిబ్రవరి 22న చెత్త నిర్వహణ చేపట్టారు. 2023 జనవరి 31 నాటికి చెత్త నిర్వహణ పూర్తీ చేశారు. 3.32,485 మెట్రిక్ టన్నుల చెత్త నిర్వహణ జరిగిందని ఆంధ్రప్రదేశ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్(ఏపీయూఐఎంఎల్) నివేదిక ఇచ్చిన విషయాన్ని మేయర్ గుర్తు చేశారు. సదరు ఏజెన్సీకి చెల్లించే డబ్బుల్లో కేంద్ర ప్రభుత్వం 33 శాతం, రాష్ట్ర వాటా 22 శాతం, 15వ ఆర్థిక సంఘం, యూఎల్‌బీ 45 శాతం ఉందన్నారు. ఇప్పటికే కేంద్రం వాటా రూ.6.03 కోట్లు, యూఎల్‌బీ వాటా రూ.3.6 కోట్లు.. మొత్తం 9.67 కోట్లు సంబంధిత ఏజెన్సీకి చెల్లించడం జరిగిందన్నారు. ఇంకా 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.2.30 కోట్లు చెల్లించే ప్రాసెస్ ఉందన్నారు. ఓ కమిటీ వేసుకుని నిజనిర్ధారణ చేసుకోవచ్చని తెలిపారు.

నగరాభివృద్ధికి చర్యలు..

అనంతపురం నగరం 16.35 కిలోమీటర్ల పరిధిలో ఉంది. భవిష్యత్తులో నగర శివారు ప్రాంతాలు, తదితర వాటిని కలుపుకుని నగరాభివృద్ధి చేయాల్సి ఉందని కమిషనర్ మేఘస్వరూప్ పేర్కొన్నారు. డిప్యూటీ మేయర్ కోగటం మాట్లాడుతూ అనధికారికంగా నిర్మాణాలు చేపట్టిన స్థల యజమానులకు రూ.కోట్లతో జరిమానా విధించారన్నారు. వాటిని తగ్గించేందుకు కౌన్సిల్‌లో తీర్మానం చేయాలన్నారు. డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య మాట్లాడుతూ నిర్మాణాత్మకమైన ఆలోచనలతో ముందుకెళ్దామన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ శ్రీహరిబాబు, డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు, కార్యదర్శి సంగం శ్రీనివాసులు, ఆర్‌ఓ సతీష్‌కుమార్, ఈఈ సూర్యనారాయణ పాల్గొన్నారు.

పశువుల తరలింపు సాధ్యమేనా?



హౌసింగ్ బోర్డులో వాహనదారులకు అడ్డంగా నిలుచున్న పశువులు

అనంతపురం కార్పొరేషన్: నగరంలో పశువుల తరలింపు సాధ్యమయ్యేలా కన్పించడం లేదు. హౌసింగ్ బోర్డు, విద్యుత్ నగర్, బుడ్డప్ప నగర్, 1, 2, 3, 4, 5 రోడ్లు, అశోక్‌నగర్, సాయినగర్, అరవింద నగర్, జీసస్ నగర్, తదితర ప్రాంతాల్లోని రోడ్లపై పశువులు యథేచ్ఛగా సంచరిస్తున్నాయి. పెద్ద సంఖ్యలో రోడ్లపైకి వస్తుండటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. పొరపాటున పశువులు ఎక్కడ దాడి చేస్తాయో అని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. పశువులకు పొరపాటున వాహనాలు తగిలితే గాయలయ్యే పరిస్థితి లేకపోలేదు. నగరపాలక సంస్థ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని పశువులను తరలించేలా చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాలి.

గురు పౌర్ణమి ఘనంగా నిర్వహిస్తాం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సాయిబాబా మందిరం సభ్యులు

అనంతపురం కల్చరల్: ఈ ఏడాది గురుపౌర్ణమి వేడుకలను సాంస్కృతిక సంబరాలతో విభిన్నంగా నిర్వహిస్తున్నామని పలువురు వక్తలు తెలిపారు. గురువారం స్థానిక వేమన టెలీఫోన్ భవన్ ఎదురుగా ఉన్న షిర్డీ సాయి బాబా మందిరం వ్యవస్థాపక సభ్యుడైన జయచంద్ర చౌదరి ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జయచంద్ర చౌదరితో పాటూ మందిర సేవా సంఘం ఉపాధ్యక్షులు పసుపులేటి కృష్ణమూర్తి, కార్యదర్శి వెంకటస్వామి, నాగానంద గుప్తా తదితరులు మాట్లాడారు. గురుపౌర్ణమి సందర్భంగా సాయినాథుడికి సంప్రదాయ నృత్యనీరాజనాలు, సాంస్కృతిక సంబరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇటీవల జాతీయ స్థాయిలో నాట్యమయూరిగా పురస్కారం అందుకున్న హరిత నాట్యప్రదర్శన, సన్మానం ఉంటాయని తెలిపారు. ఈనెల 21న ఉదయం కాకడ హారతి, మంగళస్నానం, సామూహిక సత్యసాయి వ్రతాలు జరుగుతాయన్నారు. ప్రతిసారి మాదిరే జిల్లాలోనే పెద్ద ఎత్తున ఉదయం నుంచి రాత్రి వరకు అన్నదానం చేస్తామని వెల్లడించారు. షిర్డీ క్షేత్రం తరహాలో సాయినాథుడికి జరిగే హారతులు, అలంకార సేవల్లో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలందుకోవాలని కోరారు. అంతకు ముందు మందిరంలో సాయిబాబాకు విశేష పూజలు, అన్న సంతర్పణ కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో కమిటీ సభ్యులు రాఘవేంద్ర గుప్తా, మేడా వేంకటేశ్వర్లు, రవీంద్రనాథ్, భార్గవ్ కృష్ణ, నారీభేరి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

డయేరియాపై అప్రమత్తత అవసరం



మహిళకు బీసీజీ టీకా వేస్తున్న వైద్య సిబ్బంది



రాప్తాడు: మాట్లాడుతున్న సీహెచ్‌ఓ శివప్రసాద్

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని ప్రజలు డయేరియాపై అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బంది సూచించారు. గురువారం ప్యాదిండి గ్రామ సచివాలయం పరిధిలోని గొల్లవాండ్లపల్లిలో వైద్య సిబ్బంది పర్యటించారు. వృద్ధులకు బీసీజీ టీకాలు వేశారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ డయేరియాపై అవగాహన కల్పించారు. జూలై 1వ తేదీ నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు డయేరియాను ఆపండి అనే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో వ్యాధి ప్రబలకుండా 0 నుంచి 5 ఏళ్లలోపు వయస్సు ఉన్న పిల్లలను గుర్తించి ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. పిల్లలకు ఓఆర్ఎస్ కలిపిన నీటిని తప్పక తాగించాలని తల్లిదండ్రులకు సూచించారు. అతిసారం రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నట్లు వెల్లడించారు. అతిసారం లక్షణాలు ఉంటే వెంటనే సమాచారం అందించాలన్నారు. భోజనానికి ముందు చేతులను శుభ్రం చేసుకోవాలన్నారు. వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి సలహాలు అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రామలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ విష్ణువర్ధన్, ఎంఎల్‌హెచ్‌పీ ప్రియాంక, ఏఎన్ఎం మాధవి, ఆశావర్కర్లు మంజుల, లింగమ్మ, కావ్య తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడు: అతిసారం ప్రబలకుండా విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సీహెచ్‌ఓ శివప్రసాద్, హెల్త్ సూపర్‌వైజర్ అరుణమ్మ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహంలో అతిసారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మూడు లేదా అంతకంటే ఎక్కువ సార్లు పలుచటి ద్రవ విరేచనాలు అయితే దానిని అతిసారం వ్యాధిగా నిర్ధారించాల్సి ఉంటుందన్నారు. అతిసార బ్యాక్టీరియా, వైరస్ ఇతర సూక్ష్మ జీవుల ద్వారా వ్యాప్తి చెందుతుందని తెలిపారు. బీసీ బాలుర వసతి గృహ విద్యార్థులు ముఖ్యంగా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. కాళ్లు, చేతులు శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. కార్యక్రమంలో వార్డెన్ గోవింద్ రెడ్డి, ఏఎన్ఎం లీలావతి, ఆశా కార్యకర్తలు గాయిత్రి, అరుణ పాల్గొన్నారు.

అనంతేశ్వరుడికి నవధాన్యాభిషేకం



పూజలందుకున్న అనంతేశ్వరుడు

అనంతపురం కల్చరల్: ఓం నమః శివాయ కరుణించు తండ్రి.. అంటూ భక్తుల శరణు ఘోషతో గురువారం నగర శివారులోని శివబాలయోగి ఆశ్రమం మార్మోగింది. పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు శివపార్వతులకు నవధాన్యాలతో అభిషేకాలు, అర్చనలు చేశారు. ఆలయ కమిటీ వారు సమకూర్చిన పూజాద్రవ్యాలతో బారులు తీరి స్వామిని దర్శించుకున్నారు. మాసశివరాత్రి సందర్భంగా గురువారం రాత్రి అనంతేశ్వరుడు, అనంతేశ్వరికి విశేష పూజలు, పంచామృతాభిషేకం, అలంకార సేవలు జరిగాయి. భజన, భక్తిగీతాలాపనల అనంతరం మహా మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం జరిగాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు జూటూరు అరవింద్, ఉపాధ్యక్షుడు రత్నగిరి దేవరాజు, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా వంగవీటి మోహన రంగ జయంతి

అనంతపురం టవర్‌క్లాక్: స్థానిక బాలాజీ కళ్యాణ మండపంలో గురువారం రాయలసీమ బలిజ సంఘం ఆధ్వర్యంలో వంగవీటి మోహన రంగా జయంతిని ఘనంగా నిర్వహించారు. వంగవీటి మోహన్ రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వంగవీటి మోహన్ రంగ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శంకరయ్య, మాజీ అధ్యక్షుడు పాములరాయి వెంకటేశ్వర్లు, విజయ భాస్కర్, సురేష్, కృష్ణమూర్తి, వెంకటరాముడు, మధుసూదన్, రామాంజనేయులు, గుర్రం నాగభూషణం, పావురాల శేఖర్, గురుమూర్తి పాల్గొన్నారు.

రోశయ్యది విలక్షణ వ్యక్తిత్వం



కొత్తూరు అమ్మవారి శాలలో రోశయ్య చిత్రపటానికి నివాళి



రోశయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు

అనంతపురం కల్చరల్: రాష్ట్ర రాజకీయ చరిత్రలో కొణిజేటి రోశయ్యది విలక్షణ వ్యక్తిత్వమని కొత్తూరు వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ కమిటీ అధ్యక్షుడు గోపా మచ్చా నరసింహులు కొనియాడారు. గురువారం అమ్మవారి శాలలో మాజీ ముఖ్యమంత్రి రోశయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మచ్చా నరసింహులు, తల్లం మురళీ, నాగభూషణం, సూర్యప్రకాష్, మిట్టా ఆంజనేయులు, జయం సురేష్, క్రిష్ణం రఘు తదితరులు మాట్లాడారు. స్వాతంత్య్రోద్యమ సమయంలో స్వయంగా గాంధీజీ రోశయ్య ఇంటికి వెళ్లి వచ్చారన్నారు. స్వాతంత్య్రం అనంతరం కూడా అనేక సందర్భాల్లో రోశయ్య రాజకీయాల్లో కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. ముఖ్యంగా వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వంలో ఆర్థికమంత్రిగా దేశంలోనే తొలిసారి రూ.లక్ష కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టిన ఘనత రోశయ్యకే దక్కుతుందన్నారు. అసెంబ్లీలో హుందాగా వ్యవహరించిన తీరు ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన మహాత్ముడి విగ్రహాన్ని, అమ్మవారి శాల పునఃనిర్మాణాలను ప్రారంభించారని గుర్తు చేశారు. అలాగే పాతూరు ఆర్యవైశ్య సంఘం అమ్మవారి శాల ప్రతినిధులు తిరువీధుల జగదీష్ నేతృత్వంలో నగరంలోని రోశయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతతో రోశయ్యకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పిన్ని నాగరత్నం, సిరిగుప్ప వెంకటేశ్, గర్జాల నాగరాజు, చల్లా కృష్ణరంగయ్య తదితరులు పాల్గొన్నారు.